క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



104 వైద్యసేవలను తనిఖీ చేస్తున్న డీపీఎంఓ డాక్టర్ రియాజ్‌బేగ్ తదితరులు

కలకడ : సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షకులు (డీపీఎంఓ) డాక్టర్ రియాజ్‌బేగ్ సూచించారు. సోమవారం మండలంలోని కలకడ పీహెచ్‌సీ పరిధిలో గుడిబండ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌ను, 104 సేవలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ 104 వైద్యసేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. ఇంటి ఆవరణలో పూల తొట్లలో నిలిచిన నీటిని తొలగించడంతో పాటు పాత టైర్లు, పాత డబ్బాల్లో నిలిచిన నీటిని తొలగించాని, ఇంటి పరిసరాల్లో దోమలు విజృంభించకుండా సరైన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఎమ్మెల్యేకి స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహాశివుడి ఆశీస్సులతో వర్షాలు బాగా కురిసి నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామికి మొక్కుకున్నారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు ఉన్నారు.

సినిమా థియేటర్ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : షుకూర్ పిక్చర్ ప్యాలెస్ థియేటర్‌ను తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు పరిశీలించారు. రాయచోటి ఆర్డీఓ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం థియేటర్‌ను పరిశీలించి థియేటర్‌లోని వసతులు, సీటింగ్ కెపాసిటీ, సౌండ్ సిస్టమ్, మరుగుదొడ్లు పరిశీలించారు. థియేటర్‌కు అనుమతులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ నివేదికను ఆర్డీఓకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చాణక్య, వీఆర్వోలు యర్రయ్య, కవిత, థియేటర్ యజమానులు షాజహాన్, జహంగీర్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ కమిటీ ఎన్నిక



ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ

పీలేరు రూరల్ : పీలేరు నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం పీలేరులో ఏఐఎస్ఎఫ్ సమావేశం నిర్వహించి నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా పునీత్‌రాజ్, వినోద్, ఉపాధ్యక్షులుగా షాహిద్, అశోక్, మహమ్మద్, సహాయ కార్యదర్శులుగా ఆకాష్, చరణ్, సురేష్, కోశాధికారిగా సాయికుమార్ ఎన్నుకున్నామని తెలిపారు.

మెరుగైన సేవలు అందిస్తాం

బి.కొత్తకోట: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పనిచేస్తామని నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి తెలిపారు. నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు. సత్యసాయిజిల్లా కదిరి మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమెకు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు శాలువలు, పూలమాలలతో సత్కరించారు.

ట్రాన్స్‌కో డీఈఈగా శివయ్య

కలికిరి: కలికిరి ట్రాన్స్‌కో డీఈఈగా శివయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది డీఈఈకి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. అలాగే ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన శ్రీనివాసులును సన్మానించారు. ఏఈ ముజీబుర్‌రెహ్మాన్, సబ్ ఇంజినీర్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

తంబళ్లపల్లె: శివాలయంలో స్వామికి అలంకరణ పనులు చేస్తూ సోమవారం తంబళ్లపల్లె నాగేంద్ర వీధికి చెందిన వాసా భాస్కర్ (48)గుండెపోటుతో మృతి చెందాడు. శివాలయంలో మంగళవారం జరగబోయే ప్రత్యేక పూజా కార్యక్రమానికి స్వామికి ప్రత్యేక అలంకరణ పనులు చేస్తున్న సమయంలో భాస్కర్‌కు గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు.

కఠోర శిక్షణ... భవితకు రక్షణ..!

- దేశభక్తిని ప్రేరేపించేలా ఎన్‌సీసీ శిక్షణ
- ప్రతిభ చాటితే ఉద్యోగాలు
- ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు



శిక్షణలో భాగంగా డ్రిల్ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

మదనపల్లె సిటీ: భావి భారత పౌరులను, క్రమశిక్షణకు మారుపేరుగా తీర్చిదిద్ది పాఠశాల స్థాయి నుంచే దేశభక్తి పెంపొందించడమే ఎన్‌సీసీ లక్ష్యం. సమాజంలోకి అసమానతలు దరిచేరకుండా సన్మార్గంలో నడిపించి దేశం కోసం అవసరమైతే యుద్ధ భూమిలోకి కూడా దూకేందుకు ఎన్‌సీసీ ప్రోత్సహిస్తోంది. భరతమాత సంరక్షణ కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించేలా సన్నద్ధం చేయడమే లక్ష్యంగా నేషనల్ క్యాడెట్ కోర్స్‌ను కేంద్ర రక్షణ శాఖ ప్రారంభించింది. ఈ మేరకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తోంది. వారి ఉన్నత భవితకు బాటలు వేస్తోంది.

జర్మనీలో..

ప్రపంచంలో ఎన్‌సీసీ తొలిసారిగా జర్మనీలో 1666లో ప్రారంభించారు. భారతదేశంలో సైన్యం కొరతను తీర్చడమే లక్ష్యంగా 1917లో యూనివర్శిటీ కోర్స్ పేరుతో ప్రారంభించబడినది. 1920లో యూనివర్శిటీ ట్రైనింగ్ కారగా ఏర్పడింది. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం యూనివర్శిటీ ఆఫీసర్స్ ట్రెనింగ్ కోర్స్‌గా పేరు మార్చింది. ఈ మేరకు పండింట్ హెచ్ ఎస్ కుంజ్రూ నేతృత్వంలోని కమిటీ జాతీయ స్థాయిలో పాఠశాలలు, కళాశాలల్లో క్యాడెట్ సంస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేయడంతో 1947 జులై 15వ తేదీన నేషనల్ క్యాడెట్ కోర్స్‌గా రూపాంతరం చెందింది. 1948లో కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీసీసీలో బాలికలకు సైతం అవకాశం కల్పించింది. 1950లో ఎయిర్‌వింగ్, 1952లో నావల్‌వింగ్ శాఖలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. 1965 ఇండో పాక్ , 1971లో బంగ్లా-పాక్ యుద్ధ సమయంలో మొదటి వరుసలో ఆర్మీ జవాన్లు ఉండగా, రెండవ రక్షణ శ్రేణిగా ఎన్‌సీసీ క్యాడెట్లు విధులు నిర్వహించారు. దీంతో ఎన్‌సీసీ వింగ్ దేశానికి అవసరమని పూర్తి స్థాయిలో గుర్తించారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా 17 డైరెక్టరేట్లు, సుమారు 667 ఆర్మీవింగ్, 60 నావల్, 61 ఎయిర్ వింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో..

ఎన్‌సీసీ గ్రూపు కమాండ్ నుంచి ఏటా 10 నుంచి 20 మంది వరకు ఢిల్లీలో జరిగే గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కవాతుకు ఎంపిక అవుతున్నారు. అలాగే ఢిల్లీలో నిర్వహించే సైనిక్ క్యాంపులకు కూడా ఎన్‌సీసీ విద్యార్థులు హాజరవుతూ వస్తున్నారు.

మెరుగైన ఉద్యోగ అవకాశాలు

ఎన్‌సీసీలో విద్యార్థులకు ఉన్నత విద్యలో సీట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నోటిఫికేషన్లలో ప్రత్యేకంగా కేటగిరీని బట్టి 5 శాతం వరకు రిజర్వేషన్ వర్తిస్తుంది. దీంతో పాటు సాయుధ బలగాలలో ఏటా 100 పోస్టులకు ఎన్‌సీసీ రిక్రూట్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్ ద్వారా చేస్తున్నారు. అలాగే మెడిసిన్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులలో 5 శాతం రిజర్వేషన్లు పొందే అవకాశం ఉంటుంది.

తిరుపతిలో ఎన్‌సీసీ యూనిట్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి తిరుపతిలో ఎన్‌సీసీ గ్రూపు కేంద్రంగా 7 యూనిట్లు ఆధ్వర్యంలో ఏటా సుమారు 3,500 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం ఏటా ఒక్కో యూనిట్‌కు 5 క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందేందుకు అర్హత, మౌలిక వసతులు ఉన్న పాఠశాలలు జూన్, జులైలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో విద్యార్థులకు ఆర్మీ, ఎయిర్‌వింగ్, నావల్ వింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. అడ్వంచర్స్, స్పోర్ట్స్‌కు సంబంధించిని కోర్సులలోనూ ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి



విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో పాటు దేశభక్తిని పెంపొందించేలా ఎన్‌సీసీ శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పొందిన ఎంతో మంది విద్యార్థులు ఎన్‌సీసీ కోటాలో ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంటెక్, బీటెక్‌లలో అడ్మిషన్లు పొందుతున్నారు. కేంద్ర సాయుధబలగాలలోనూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ప్రత్యేక డ్రైవ్‌లతో ఎన్‌సీసీ విద్యార్థులు రిక్రూట్ చేసుకుంటున్నాం.
–గుర్రం దేవకమ్మ, ఎఎన్‌ఓ, జెడ్పీహెచ్‌ఎస్.మదనపల్లె

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు



ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుంది. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణ అలవాటవుతుంది. తద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తుంది. ప్రతి విద్యార్థికి ఎన్‌సీసీతో ఎంతో మేలు చేకూరుతుంది. ఎంతటి సమస్యలనైనా ఎదుర్కోనే మనోధైర్యం కల్పిస్తుంది.
–పసుపులేటి ఈశ్వరమ్మ, ఎఎన్‌ఓ, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మన్సూర్

పెద్దమండ్యం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలు కాగా, యువతికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్దమండ్యం – గుర్రంకొండ రహదారిపై సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. బాధితుల కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎన్‌ఓ పల్లె పంచాయతీ కలిచెర్ల పాతూరుకు చెందిన ఎస్ షబ్బీర్ అహ్మద్ కుమార్తె సుమియా (16) వాల్మీకిపురం మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాలలో సుమియాను వదిలేందుకు సోదరుడు మన్సూర్ (20) తన చెల్లెలుతో కలిసి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. కలిచెర్లకు సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయం వద్ద మలుపులో ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న బొలోరో పికప్ వాహనం ఢీ కొంది. ప్రమాదంలో మన్సూర్‌కు తీవ్ర గాయాలు కాగా, సుమియాకు స్వల్ప గాయాలయ్యాయి. 108లో బాధితుడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్కౌట్స్, గైడ్స్ యూనిట్ ప్రారంభించాలి



మాట్లాడుతున్న డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం

మదనపల్లె సిటీ: ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించాలని మదనపల్లె డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఒక రోజు ఒరింటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది.స్కౌట్స్ యూనిట్ ప్రారంభించడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సేవా భావం అలవడుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులను యూనిట్‌లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ జాయింట్ సెక్రటరీలు భాస్కరరెడ్డి, భూపతి, చంద్రశేఖర్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో లోపించిన పారిశుద్ధ్యం



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ధరణికుమార్

పీలేరురూరల్ : పీలేరు పట్టణంలోని లక్ష్మీపురంలో రాజకీయ పార్టీల వర్గపోరుతో పారిశుద్ధ్యం లోపించిందని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ మండిపడ్డారు. సోమవారం లక్ష్మీపురాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురంలో ఎస్సీ కాలనీలో మురుగునీటి కాలువలు స్తంభించిపోయాయని, చెత్తాచెదారం పేరుకుపోయిందని తెలిపారు. దీంతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రికి వీల్‌చైర్స్ వితరణ



దాతలు వితరణ చేసిన వీల్‌చైర్స్‌తో వైద్యులు

పీలేరు : పీలేరు ప్రభుత్వాస్పత్రికి మండలంలోని జాండ్ల పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన పల్లం జయప్రకాష్, కొప్పు నాగరాణి వీల్‌చైర్స్ వితరణ చేశారు. గంగయ్య, లక్ష్మమ్మ 5వ వర్ధంతి సందర్భంగా వంద పడకల ఆస్పత్రికి రెండు వీల్‌చైర్స్ అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దాతలు సాయం చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ కె.వి. సరస్వతమ్మ, డాక్టర్ ఎస్. కరీముల్లా, డాక్టర్ హరీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దతిప్పసముద్రం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కూటమి నాయకులతో కలసి మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాట్నగల్లులో పర్యటించారు. తాగునీరు, విద్యుత్, మురికి కాలువలు, సీసీ రోడ్లు, రైతాంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ కేఎస్ బాలాజీ, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు చంద్రమోహన్, సురేంద్రనాయుడు, శ్రీకంఠరెడ్డి, సంపతి కోట కిట్టన్న, సురేష్, ముని, సికిందర్, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుదాకు హంద్రీనీవా జలాలను అనుసంధానం చేయాలి

నిమ్మనపల్లె : మండలంలోని ముష్టూరు బహుదా ప్రాజెక్టుకు హంద్రీనీవా జలాలను అనుసంధానం చేయాలని నిమ్మనపల్లె టీడీపీ నాయకుడు ఎర్రప్ప గారి పల్లె లక్ష్మన్న, పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, యూత్ విభాగం అధ్యక్షుడు చినబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు విజయ్, సోమవారం మదనపల్లె పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేశారు. బహుద ప్రాజెక్టు పరిధిలో 2,880 ఎకరాలలో పంటలు సాగు అవుతున్నాయన్నారు. హంద్రీనీవా కాలువను బహుద ప్రాజెక్టుకు అనుసంధానం చేసి నీరు అందిస్తే నిమ్మనపల్లె, వాల్మీకిపురం మండలాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని విన్నవించారు. కార్యక్రమంలో మాజీ పార్టీ అధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులు, నాయకులు చెంద్రాయుడు, సహదేవ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



రోగులకు అన్నం ప్యాకెట్లు పంచిపెడుతున్న భాస్కరాచారి

మదనపల్లె సిటీ: లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదట స్థానిక సీటీఎం రోడ్డులోని చైతన్య అనాథాశ్రమంలో చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంచిపెట్టారు. కార్యక్రమంలో యుగంధరాచారి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



ఎస్ఐ లోకేష్

పీలేరు రూరల్ : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని పీలేరు అర్బన్ ఎస్ఐ ఎం. లోకేష్ తెలిపారు. పీలేరు అర్బన్ ఎస్ఐగా ఎం. లోకేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి బదిలీపై కర్నూలు జిల్లాకు వెళ్లారు. రాజంపేట ఎస్ఐగా పని చేస్తున్న లోకేష్ బదిలీపై పీలేరుకు వచ్చారు.

సీఎం సహాయ నిధికి విరాళం

కేవీపల్లె : విజయవాడ వరద బాధితుల సాయం కోసం మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల జూనియర్ కళాశాల అధ్యాపకులు సీఎం సహాయ నిధికి రూ. 50 వేలు అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనతో పాటు అధ్యాపకులు డాక్టర్ రమాదేవి, లక్ష్మీపతినాయుడు, డాక్టర్ రామకృష్ణాంజనేయులు, శివమూర్తి, శేఖర్ రెండు రోజుల క్రితం బంగారుపాళెంకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలసి చెక్‌ను అందజేసినట్లు తెలిపారు.

బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత

లక్కిరెడ్డిపల్లె : బాల్య వివాహాలను అరికట్టడం మనందరి బాధ్యతని సమత ఫౌండేషన్ సభ్యురాలు అమృత తెలిపారు. సోమవారం మండలంలోని స్థానిక పాఠశాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంస్థ కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహకారంతో నడుపుతున్నట్లు చెప్పారు. అనంతరం అమృత మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టే బాధ్యత భవిష్యత్తు తరాలైన పిల్లలపై ఉందన్నారు. బాల్యం అనేది దేవుడు ఇచ్చిన గొప్ప వరమని, బాల్యంలో బాగా చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ, ప్రగతి దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా కోరారు. సోమవారం మండలంలోని పోతబోలు పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు కలిగిన మేలును వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చమర్తి జగన్మోహనరాజు, నాదెళ్ల విద్యాసాగర్, సర్పంచ్ ఈశ్వరయ్య, ఎంపీడీఓ భానుప్రసాద్, తహసీల్దార్ ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేషస్పందన

నియోజకవర్గంలోని యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మదనపల్లెలో ఐటీహబ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

రామసముద్రం: రామసముద్రం మండలంలో మంగళ, బుధవారాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఓ మోహన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ, అనుబంధ శాఖలైన పశువైద్య, ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖల అధికారులు రైతు సేవా కేంద్రాల పరిధిలోని పొలాలను సందర్శించి సాగు ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సాంకేతిక, ఆధునిక సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. అనంతరం సమావేశం నిర్వహించి, రైతులకు ఉన్న సందేహాలను నివృతి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మదనపల్లె : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయశాఖ, అనుబంధ రంగాల ఆధ్వర్యంలో ప్రతి మంగళ, బుధవారం రెండురోజుల పాటు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీఏ శివశంకర్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 2024 నుంచి వారానికి రెండురోజులు మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ, అనుబంధశాఖలైన ఉద్యాన, మత్స్య, పట్టుపరిశ్రమ, పశుసంవర్థక, మార్కెటింగ్, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో ఒక బృందంగా ఏర్పడి ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పల్లెల్లో పొలాల పరిశీలన, గ్రామసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులకు మెరుగైన వ్యవసాయ విస్తరణ సేవలు, అధునాతన సాంకేతిక సలహాలు, సూచనలు, ఐటీని వ్యవసాయ రంగంలో ఉపయోగించుట, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం పొలం పిలుస్తోంది కార్యక్రమ ముఖ్య ఉద్దేశాలుగా పేర్కొన్నారు. రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల సత్తా



కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీతో కరాటే మాస్టర్, విద్యార్థులు

పీలేరు : కర్నూలులో ఆదివారం జరిగిన 6వ ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో పీలేరు యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు సత్తాచాటారని కరాటే మాస్టర్ జి. ఇనాముల్‌హక్ తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన వికాష్ 13 సంవత్సరాల విభాగం కటాలో, ఫైట్‌లో గోల్డ్‌మెడల్, రహీల్ అఫ్రిద్ 11 సంవత్సరాల విభాగం కటాలో ప్రథమస్థానం, ఫైట్‌లో మూడో స్థానం, కస్విత 10 సంవత్సరాల విభాగం కటాలో ప్రథమ స్థానం, ఫైట్‌లో మూడో స్థానం, అస్వాన్ 8 సంవత్సరాల విభాగం కటాలో ప్రథమ స్థానం, ఫైట్‌లో మూడో స్థానం, గగన్ 11 సంవత్సరాల విభాగం కటాలో ద్వితీయ స్థానం, ఫైట్‌లో తృతీయ స్థానం, దిశాంత్ 8 సంవత్సరాల విభాగం కటాలో ప్రథమ స్థానం, ఫైట్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

కిరణ్‌కుమార్ శర్మకు వాస్తురత్న పురస్కారం



జోతిష్య రత్న, వాస్తురత్న పురష్కారాన్ని అందుకుంటున్న కిరణ్‌కుమార్ శర్మ

పీలేరు : పీలేరుకు చెందిన సూత్రంసిద్ధి కిరణ్‌కుమార్‌శర్మకు వాస్తురత్న పురస్కారం లభించింది. ఆదివారం తిరుపతిలో విశ్వజ్యోతి జోతిష్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జోతిష్య రత్న, వాస్తురత్న పురష్కారాన్ని కిరణ్‌కుమార్ శర్మకు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 200 మంది వాస్తు జ్యోతిష్య పండితుల మధ్య సత్కారం పొందడం ఆనందంగా ఉందన్నారు. టీటీడీ ప్రధాన అర్చకులు వేణుగోపాల్, శ్రీ కాళహస్తీశ్వర స్వామి ఆలయం ప్రధాన అర్చకులు గురుకుల్ పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

కేవీపల్లె : గ్రామ వలంటీలర్ల వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.ఎల్. వెంకటేష్ డిమాండ్‌చేశారు. కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే గ్రామ వలంటీర్ల జీతాలు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయినా వలంటీర్ల వ్యవస్థపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. వలంటీర్లు ఐక్యమత్యంతో పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

అందరికీ మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య

తంబళ్లపల్లె: అందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మెగా మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే శానిటరీ వర్కర్లు 28 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, ఏఓ ఆనందకుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్లు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

వెంకటరమణారెడ్డి సిటీ: డ్రైవర్లు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మదనపల్లె ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి సూచించారు. సోమవారం డిపోలో డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేఎంపీఎల్ పెంచాలని సూచించారు. సంస్థకు ఆదాయం పెంచాలన్నారు. సీఐ రేవతి, ఎంఎఫ్ రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



ప్రజాదర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారికిషోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఒకొక్కటే నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. మర్రిపాడులో స్మశానం స్థలం ఆక్రమించుకొన్నారని మృతదేహాలను స్మశానంలోకి రానివ్వకుండా అడ్డుకొంటున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తలారివాండ్లపల్లెలో తాగునీటి బోరుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఆరునెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇదే గ్రామంలో ఇళ్లపైనే విద్యుత్ తీగెలు వేలాడుతుండడంతో పలువురు ప్రమాదాల బారిన పడ్డారని తెలిపారు. సుంకరవాండ్లపల్లెలో పొలాలకు వె వెళ్లేందుకు దారిలేక అవతలివైపు పొలాలు బీళ్లు బారిపోయాయని రైతులు ఫిర్యాదు చేశారు. శ్రీపోలేరమ్మవీధిలో వీధికి మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కృష్ణాపురం, గెరికుంటపల్లె గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశులు, సర్పంచ్‌లు ఆనంద, లలిత, ఎంపీటీసీ ప్రసాద్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ మూర్తి స్వామి పాల్గొన్నారు.